ప్రజారోగ్య పరిరక్షణకే 'జగనన్న సురక్ష'

హొళగుంద: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని హొళగుంద పీహెచ్‌సీ వైద్యాధికారులు హిమబిందు, న్యూటన్ అన్నారు. సోమవారం హొళగుంద, ఎల్లార్తి, పెద్దహ్యాట, చిన్నహ్యాట తదితర విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల పరిధిలో వలంటీర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన వారికి అక్కడే బీపీ, షుగర్, హెచ్‌బీ తదితర పరీక్షలను నిర్వహించారు. అలాగే వారి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్నారు. వారికి టోకెన్లు ఇచ్చి ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించే వైద్య శిబిరాలలో చికిత్స, వైద్య సేవలు, మందులు పొందాలని, సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోందని, ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.

చిప్పగిరి: మండలంలోని డేగుల హాలు గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారు ఈ నెల 30 నుంచి నిర్వహించే శిబిరాల్లో వైద్య సేవలు పొందాలని సూచిస్తూ టోకెన్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నీలకంఠ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఆలూరులో ముమ్మరంగా సాగుతోంది. ఆలూరు పట్టణంలోని సచివాలయం–3 పరిధిలో ఉన్న ఈరన్న కొట్టాలలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేసుకున్నారు.

పక్కా ప్రణాళికతో సురక్ష సర్వే

ఆలూరు రూరల్: ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్య సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. సోమవారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, ఆశాలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా ఆరోగ్య స్థితిగతులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి నిర్వహించే ఆరోగ్య శిబిరాల్లో చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించి టోకెన్లు అందించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ అంద్రూస్, సూపర్‌వైజర్లు చంద్రకళ, బాషా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.


హొళగుందలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హాలహర్వి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆంతోని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. జగనన్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఆలూరు ఈరన్న కొట్టాల వీధిలో వృద్ధురాలికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


ఆరోగ్య సర్వేపై సూచనలు చేస్తున్న డాక్టర్ శాంతి

విజయవంతం చేద్దాం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ, జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం–1 ఆవరణలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని రకాల పరీక్షలు చేశారు



వృద్ధులకు, మంచానికి పరిమితమైన వారికి సైతం వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వైద్యశాలకు వెళ్లలేని వారికి ఎంతో మేలు కలుగుతుంది. వైద్య సిబ్బంది మా ఇంటి వద్దకే వచ్చి నాకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. త్వరలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, అక్కడ చికిత్స అందిస్తామని చెప్పి టోకెన్ ఇచ్చారు. ఇలాంటి సేవలు ఎప్పుడూ చూడలేదు.

– జేకే సోఫియాబేగం, ఆలూరు

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే సాధ్యమైంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది మా ఇంటికి వచ్చి నాకు కొన్ని రకాలు పరీక్షలు చేశారు. త్వరలో నిపుణులైన డాక్టర్లతో చికిత్సతో పాటు మందులు ఇస్తారని చెప్పారు. పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

–వి.మూర్తి, ఆలూరు

● **గోనెగండ్ల:** మండలంలోని గోనెగండ్ల, హెచ్.కై రవాడి, బి.అగ్రహారం తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపట్టిన ఆరోగ్య సురక్ష సర్వేను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, డాక్టర్ రవళి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇంట్లోని ప్రతి ఒక్కరికీ బీపీ, హెచ్‌బీ, షుగర్ పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్.కైరవాడిలో ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేష్

● **తుగ్గలి:** మండలంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే చురుగ్గా సాగుతోంది. ఈనెల 15 నుంచి బొందిమడుగుల, రాతన, రామకొండ, మారెల్ల, ముక్కెల్ల, రాంపల్లి, ఎద్దులదొడ్డి తదితర గ్రామాల్లో దాదాపు 5,024 కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 20 వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాయాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తుగ్గలి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.


రామకొండలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామళ్లకోటలో 'నా భూమి – నా దేశం'

వెల్దుర్తి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని మండల పరిధిలోని రామళ్లకోట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బజారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా సాగారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి, డీలర్ శేషన్న పాల్గొనగా ప్రముఖ వైష్ణవ క్షేత్రం వనం వేంకటేశ్వర స్వామి ఆలయం చేరుకున్నారు. ఆలయ పరిసర మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని అమృత కలశ యాత్రకు పంపనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

హొళగుంద: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ విద్యార్థులకు సూచించారు. సోమవారం హొళగుందలో నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి పవిత్ర మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీకి పంపించడం జరుగుతుందని హెచ్‌ఎం తెలిపారు. అమరుల పోరాటాల వల్ల ఆనందంగా ఉంటున్నామని, వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


రామళ్లకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఉత్తమ పీడీకి సన్మానం

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సుజన కుమారి ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ పీడీగా ఎన్నికైంది. ఈ సందర్భంగా సోమవారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణమూర్తితో పాటు ఉపాధ్యాయులు ఆమెను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉత్తమ సేవలందించే వారికి తగిన గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. పాఠశాల నుంచి క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించేలా కృషిచేసిన సుజన కుమారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పీడీ సుజనకుమారిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఆదోని ట్రాన్స్‌కో డీఈఈ

హొళగుంద: వ్యవసాయం, గృహ వినియోగానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆదోని ట్రాన్స్‌కో డీఈఈ సుధాకర్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన సోమవారం ఏడీఈ నాగేంద్రప్రసాద్‌తో కలిసి కోగిలతోటలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ కోగిలతోటలో రూ.1.50 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఆ గ్రామానికి చెందిన కొందరు రైతులు సబ్ స్టేషన్‌కు స్థలం ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందకొచ్చినట్లు తెలిపారు. ఈ సబ్ స్టేషన్‌లో మూడు ఫీడర్‌లు కలపడం వల్ల పరిసర గ్రామాల రైతులకు, ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ప్రజలు విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించాలని, బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఏఈ ఓబులమ్మ, ఏఈలు లోకేష్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ బ్రహ్మోత్సవాలు


హోరాహోరీగా తలపడుతున్న పొట్టేళ్లు

● ఆకట్టుకున్న పొట్టేళ్ల పోటీలు
● నేడు అమ్మవారికి బోనాల సమర్పణ

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో మాతా మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమ వారం అమ్మవారిని ప్రత్యేక నగలతో అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆటలపోటలు రసవత్తరంగా సాగుతున్నాయి. రాత్రి ప్రముఖ గాయని మధుప్రియ జానపద కచేరితో సందడి చేశారు.

విజేతలకు నగదు బహుమతులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి భజన పోటీల్లో ఉయ్యాలవాడ, గద్వాల జిల్లా పరిధిపురం–1, పరిధిపురం–2, శంకరాపురం, మండ్లవానిల్లె జట్లు విజేతలుగా నిలిచినట్లు ఆల య కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా బృందాలకు దాతల సహకారంతో వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలను అందజేశారు. పొట్టేళ్ల పోటీల్లో తాండ్రపాడుకు చెందిన శివ, గుడిపాడుకు చెందిన అనూష ఓర్వకల్లు మండలం యంబాయికి చెందిన రాజు పొట్టేళ్లు గెలుపొందినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.15 వేలు, రూ12.5 వేలు, రూ.10 వేలను అందజేశారు.

నేడు బోనాల సమర్పణ

మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

అలసందగుత్తిలో పోలీస్ పికెట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు జరిపిన దాడులకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆదేశాల మేరకు సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులుతో పాటు ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లతో పికెట్ నిర్వహించారు. టీడీపీకి చెందిన సోమలింగ, నరసప్ప, లక్ష్మన్న, శంకరప్పతో పాటు పలువురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.


పికెట్‌లో పాల్గొన్న పోలీసులు

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డి, దిగువచింతలకొండ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తి కావడంతో ఎద్దులదొడ్డి, శభాష్‌పురం సచివాలయాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వాటితో పనులు చేపట్టారు. వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ పుష్పావతి గౌరవ సలహాదారు రవి సోమవారం పనులకు పరిశీలించారు.

ఆలూరులో మోస్తరు వర్షం

ఆలూరు రూరల్: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత నెల రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. ఈ స్థితిలో కురిసిన వర్షం రైతులు సాగు చేసిన పంటలకు జీవం పోసినట్లయ్యింది. గంట పాటు కురిసిన వర్షానికి పంటలు తడవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గత వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు.

శ్రీమఠం హుండీ ఆదాయం లెక్కింపు

మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. ఎండోమెంట్ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కకట్టారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి హుండీ కానుకలు గణన చేస్తున్నట్లు మఠం మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారంతో హుండీ లెక్కింపు పూర్తి కానుంది.


హుండీ కానుకలను లెక్కిస్తున్న సేవా భక్తులు

కరువు మండలంగా ప్రకటించాలి

దేవనకొండ: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, మండల రైతు సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవక రైతులు సాగుచేసిన పంటలన్నీ ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు యూసుఫ్‌బాషా, పాండు, సుంకన్న, శ్రీనివాసులు, వీరన్న, రాయుడు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: పత్తికొండ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శి సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, రైతు సంఘం నాయకులు రంగారెడ్డి మాట్లాడారు. సంఘాల నాయకులు దస్తగిరి, సీఐటీయు వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఈరన్న స్వామికి విశేష పూజలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామిని సోమ వారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాల తో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

క్లుప్తంగా

వేణుగోపాల స్వామి ఆలయానికి నూతన రథం


భక్తుల విరాళాలతో తయారు చేయించిన కొత్త తేరు

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో వెలసిన పురాతన వేణుగోపాల స్వామి ఆలయానికి నూతన రథం సిద్ధమైంది. ఏటా పండుగలు, ఉత్సవాల సమయంలో స్వామివారిని ఊరేగింపు చేసేందుకు భక్తులు అందించిన దాదాపు రూ.8 లక్షలతో నూతన రథాన్ని తయారు చేయించారు. రథాన్ని ఆలయానికి చేర్చగా పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కృష్ణగిరి: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ కనెక్షన్ల కోసం వచ్చే రైతుల నుంచి కొందరు దళారులు డబ్బులు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన రైతులు అన్ని ఆధారాలతో మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో అందజేస్తే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని చప్పారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే అన్ని గ్రామాల్లో జీపీఎస్ సర్వే 90 శాతం పూర్తి చేశామన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


రంగనాథ స్వామి హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం ఈఓ చంద్రశేఖరరెడ్డి, పర్యవేక్షణ అధికారి సీతారామిరెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ దస్తగిరిగౌడ్ ఆధ్వర్యంలో హుండీలోని కానుకల లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి హుండీలోని కానుకల లెక్కింపు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం నాటి లెక్కింపులో రూ.9,61,755 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

మద్దికెర: జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసాయి కాలేజీ కరెస్పాండెంట్ మాధవ్, ప్రిన్సిపాల్ సునీత సోమవారం తెలిపారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన సూపర్–7 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పూజారి మహేష్, యువరాజ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌ను అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఐ వరప్రసాద్, సిబ్బంది

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామం వద్ద సోమవారం రూ.లక్ష విలువ చేసే కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాలు మేరకు.. కారుమంచి గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టి గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామానికి చెందిన హరేంద్ర, మల్లికార్జున అనే వ్యక్తులు కర్ణాటక మద్యంను ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. ఆటోను సీజ్ చేయడంతో పాటు 20 బ్యాక్సుల్లో ఉన్న 1,920 కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

తుగ్గలి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి తీవ్ర వర్షాభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి సరైన వర్షాలు లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంట పెట్టుబడులకు రైతులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, రంగరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న భూములకు పరిహారం చెల్లిస్తేనే రైతులు తమ భూములిస్తారని రాయలసీమ విద్యావంతుల వేదిక తాలూకా కన్వీనర్ నాగన్న స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని గోనెగండ్ల, ఐరన్‌బండ్, గంజిహళ్లి గ్రామాల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడీపీ ఎత్తు పెంచడం వలన ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, నెరుడుప్పల, బెల్లందొడ్డి, తదితర గ్రామాల్లో రైతులు భూమిని కోల్పోతారని, జీడీపీ ఎగువ ప్రాంతంలోని భూములు ఇవ్వాలంటే ఎకరాకు రూ.30 లక్షలు చొప్పున చెల్లించాలన్నారు. అలాకాని పక్షంలో భూమికి భూమి చూపించాలని డిమాండ్ చేశారు. జీఓ 98 ప్రకారం ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల రైతులు నజీర్, కొలుట్లయ్య, సుందరం, షరీన్‌బాబు, గిడ్డయ్య, రాజరత్నం, తిక్కయ్య, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనతో సమస్యల పరిష్కారం

చిప్పగిరి: స్పందనతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన పలు వినతులు వారు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ నాగభూషణం, ఏఈ ఉలిగన్న, ఏపీఎం నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

నందవరం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 2021–22, 2022–23 సంవత్సరంలోని పెండింగ్ వర్క్‌లను పూర్తి చేయాలని ఏపీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే వర్క్ ఫైల్స్‌ను జాగ్రత్త పరచాలని ఆదేశించారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తయిందని, అడిగిన వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలన్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఎవరైన మిగిలి ఉంటే పూర్తి చేయాలన్నారు. ఈసీ నూర్జహాన్, టీఏలు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

దేవనకొండ: మండలకేంద్రంలో ప్రభుత్వ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవనకొండ చుట్టుపక్కల గ్రామాల్లోని విద్యార్థులు సౌకర్యార్థం మండల కేంద్రంలో హాస్టల్‌ను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యువజన సంఘం నాయకులు రంగన్న, రామాంజనేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

నందవరం: మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యానందరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో తాగునీరు, డ్రైయినేజీ, మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ఈ హాస్టల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు ఉన్నారని, స్నానం గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రత్నం, రాజేష్, అద్బుత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామంలో విశ్వబ్రాహ్మణ కులస్తుల దహన సంస్కారాలకు కొందరు అడ్డుపడుతున్నారని విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమి తి ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల తహసీల్దారు కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, అడ్వకేట్ కమ్మర హరికృష్ణ మాట్లాడుతూ శ్మశాన వాటికలో పూడ్చకూడదని కొందరు అడ్డుపడటం అన్యాయమన్నారు. చనిపోయిన వారిని పూడ్చేందుకు కొంత స్థలాన్ని కేటాయించాలని కోరారు. గ్రామ నాయకులు సిద్దయ్య, ఆదిశేషు, మౌనేష్, లక్ష్మీనారాయణ, వీరేష్, జితేంద్ర తదితరులు ఉన్నారు.